## న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

### హైకోర్టు జడ్జి రాధారాణి

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 5 : సంగారెడ్డి జిల్లాలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ హైకోర్టు న్యాయాధికారి, సంగారెడ్డి జిల్లా పోర్టు పోలియో జడ్జి డా.రాధారాణి పేర్కొన్నారు. సంగారెడ్డిలో శనివారం ఆమె పర్యటించిన సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ లాయర్లు ఎదుర్కొంటున్న సమస్యలు తనదృష్టికి తీసుకుస్తే పరిష్కరించేందుకు తనవంతుగా కృషిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర, బార్ అసోసియేషన్ నాయకులు సూరిరెడ్డి, అంబరీష్ మహిళా ప్రతినిధి లలిత, లైబ్రరీ సెక్రటరీ ఆంజనేయులు, జ్ఞానేబా, విజయ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



## అన్నపూర్ణదేవిగా దుర్గమ్మ..

పాపన్నపేట, అక్టోబరు 5 : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఏడుపాయల వనదుర్గామాత అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు సనాతనశర్మ, శంకర శర్మ, పార్థివశర్మలు తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్టుకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మండపంలో నెలకొల్పిన దుర్గమ్మకు నీలిరంగు వస్త్రాల్లో పూలతో అన్నపూర్ణదేవిగా ఆలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తుల కోసం సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.మెదక్ జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ రీబా లాల్‌చంద్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.



ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకున్న జడ్జి



## పదమూడేళ్ల కలను నెరవేర్చబోతున్నా...

- మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై జగ్గారెడ్డి సమీక్ష
- చెరువు మధ్యలో భారీ శివుడి విగ్రహం
- సీఎం రేవంత్, మంత్రులు ఉత్తమ్, దామోదర్ దృష్టికి తీసుకువెళ్లి నిధులు సమకూరుస్తా
- ఓడినా ప్రజల మధ్యనే ఉంటున్నా..
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 5: సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువును అద్భుతంగా తీర్చిదిద్దడానికి యుద్ధప్రాతిపాదికన చర్యలు చేపట్టాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము రెండు గంటల వరకు ఆయన మహబూబ్‌సాగర్ కట్టపై పర్యటించారు. చెరువును శుద్ధి చేసి, సుందరీకరణ చేయాలని పదమూడేళ్లుగా అనుకుంటున్నానని చెప్పారు. రెండేళ్ల తెలంగాణ ఉద్యమం, పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో తన కల నెరవేరలేదని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కలను సాకారం చేయబోతున్నానని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకువెళ్లి ఎన్ని నిధులనైనా విడుదల చేయిస్తానని, వెంటనే ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు.

కర్ణాటక రాష్ట్రంలో 130 అడుగుల ఎత్తైన శివుడి విగ్రహం తరహాలోనే సంగారెడ్డిలోని కిందిబజార్ మహబూబ్‌సాగర్ చెరువు మధ్యలో భారీ శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉన్నదని జగ్గారెడ్డి వివరించారు. కట్టపై దర్గాను, దుర్గమ్మ ఆలయం, రజకుల అమ్మవారి గుడి, మల్లన్న, బీరప్ప ఆలయాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. లైటింగ్, బ్రిడ్జి నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థను సరిచేసే పనులను చేపట్టాలని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జూలై వరకు పనులన్నీ పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

### ఇలాంటప్పుడే నిద్ర పట్టదు

'టైంకు జరగాల్సిన పనులు జరుగకుంటే నాకు నిద్ర పట్టదు.. అందుకే అర్ధరాత్రి సమయంలో ఇక్కడకు వచ్చాను. మున్సిపల్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడూ అర్ధరాత్రి పట్టణంలో లైట్లు వెలుగుతున్నాయా లేదా అని చూసేవాడిని, 4 గంటలకే మున్సిపల్ కార్మికుల పనితీరును పరిశీలించేవాడిని' అని జగ్గారెడ్డి పేర్కొన్నారు. గెలిచినా, ఓడినా ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల కోసమే శ్రమిస్తున్నానంటూ తన మనసులోని మాటలను పంచుకున్నారు.



మహబూబ్‌సాగర్ కట్టపై ఇరిగేషన్‌శాఖ అధికారులతో సమీక్ష చేస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

## పరిశీలన ముగిసింది..

# నియామకమే మిగిలింది

- ముగిసిన డీఎస్సీ అభ్యర్థుల వెరిఫికేషన్
- 1:3 నిష్పత్తిలో ఆహ్వానం
- సంగారెడ్డి జిల్లాలో 991 మంది, మెదక్ జిల్లాలో 682 మంది హాజరు
- దసరా తర్వాత బడులకు కొత్త టీచర్లు

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, అక్టోబరు 5 : డీఎస్సీ-2024లో ర్యాంకులు సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ముగిసింది. ఈ నెల 2వ తేదీ నుంచి 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టిన విషయం తెలిసిందే. సంగారెడ్డి శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో శనివారం ఎస్జీటీ విభాగంలో 765 మందికి 712 మంది, లాంగ్వేజ్ పండిట్స్ విభాగంలో 43 మందికి 41 మంది, పీఈటీ విభాగంలో 18 మందికి 15 మంది, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 240 మందికి 223 మంది అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. ఎస్జీటీ, లాంగ్వేజ్ పండిట్స్, పీఈటీ విభాగంలో 58 మంది, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 17 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.



సంగారెడ్డిలో సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న డీఈవో, అధికారులు

### మెదక్‌లో చివరి రోజు 61 మంది హాజరు

మెదక్ జిల్లాకు సంబంధించి డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ మెదక్‌లోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో చివరిరోజు శనివారం ఉదయం 10 గంటలను సాయంత్రం 5 గంటలకు కొనసాగింది. చివరి రోజు 61 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 732 మంది ఎస్జీటీ, ఎస్ఏ, పండిట్, వ్యాయమ ఉపాధ్యాయ అభ్యర్థులు 1:3 నిష్పత్తిలో సర్టిఫికెట్ల పరిశీలన హాజరు కావాల్సి ఉండగా... 682 మంది(93.17శాతం)హాజరు కాగా.. 50 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు.

### సర్దుబాటుకు బ్రేక్!

#### కొత్త టీచర్లు వస్తే పోస్టులన్నీ ఫుల్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 5 : ఉపాధ్యాయుల సర్దుబాటుకు బ్రేక్ పడినట్టేనా? అంటే విద్యాశాఖ అధికారుల నుంచి అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉపాధ్యాయుల సర్దుబాటుకు గత నెలలో ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను తాత్కాలికంగా సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిన నేపథ్యంలో గత నెలలో జిల్లా విద్యాశాఖ ఆ మేరకు చర్యలు చేపట్టింది. స్థానిక పరిస్థితులను బట్టీ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు అవసరమైన కసరత్తు చేశారు. ఈ మేరకు ఎంఈవోల ద్వారా టీచర్ల సర్దుబాటు డేటాను కూడా సేకరించారు. ఇంతలోనే 2008- డీఎస్సీ అభ్యర్థులను కాంట్రాక్టు టీచర్లుగా నియమిస్తామని సర్కారు నిర్ణయించింది. వారందరి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కూడా ఇప్పటికే పూర్తిచేసింది. తాజాగా టీచర్‌పోస్టుల భర్తీకి డీఎస్సీ-2024 నిర్వహించి ఫలితాలు వెలువరించింది.

ఈ నెల 5 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టింది. ఈ నెల 9న అపాయింట్‌మెంట్ ఆర్డర్లు కూడా ఇస్తామని ఇటీవల సీఎం ప్రకటించారు. వాస్తవానికి జిల్లాలో 989 టీచర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. అయితే డీఎస్సీ-2008, డీఎస్సీ-2024 ద్వారా జిల్లాలో సుమారు 600 కొత్త ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో టీచర్ల సర్దుబాటు అవసరం ఉండబోదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో సర్దుబాటు ఉండే అవకాశం లేదు.




నిజామాబాద్‌లో జరిగిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సన్మానసభలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి

## టీపీసీసీ అధ్యక్షుడి సన్మాన సభలో నిర్మలజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 5: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన అనంతరం తొలిసారి సొంత జిల్లా నిజామాబాద్‌కు వెళ్లిన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. కార్యక్రమానికి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి హాజరయ్యారు. మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వేదికపై ఆశీనులయ్యారు.

## బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్

సంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుల్లో కలెక్టర్ వల్లూరు క్రాంతి సందడి చేశారు. పాత డీఆర్డీఏ ఆఫీసు ఆవరణలో నిర్వహించిన ఉత్సవాల్లో మహిళా సమాఖ్య సభ్యులు, ఉద్యోగులతో కలిసి ఆమె బతుకమ్మ ఆడారు.

-సంగారెడ్డి రూరల్



## పకడ్బందీగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే

- సీఎంవో కార్యాలయ ప్రత్యేక అధికారి సంగీత
- సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఇంటింటి సర్వే పరిశీలన



మెదక్ పట్టణంలో సర్వేను పరిశీలిస్తున్న సీఎంవో ప్రత్యేకాధికారి సంగీత

మెదక్ అర్బన్/రామచంద్రాపురం, అక్టోబరు 5: ప్రతీ కుటుంబాన్ని కలిసి ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సీఎంవో కార్యాలయ ప్రత్యేకాధికారి సంగీత అధికారులకు సూచించారు. ఆమె శనివారం రామచంద్రాపురం మండలం తెల్లాపూర్, మెదక్ పట్టణంలోని 20వ వార్డులో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే ప్రక్రియ చురుకుగా సాగుతోందన్నారు. అధికారులు ఇంటింటికి వెళ్లి కుటుంబాల సమగ్ర వివరాలను సేకరించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా పక్కాగా వివరాలు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీలోని 3వ వార్డులో పైలట్ ప్రాజెక్టు కొనసాగుతున్న తీరును సీఎం ప్రత్యేక కార్యదర్శికి ఇన్‌చార్జి తహసీల్దార్ అధికారి దేవుజ వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్, తహసీల్దార్ లక్ష్మీబాబు, ఈడీఎం సందీప్, తెల్లాపూరులో ఆర్ఐ శ్రీకాంత్, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ ఎం.సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఇసోజిపేటలో కలెక్టర్..

పుల్‌కల్: మండలంలోని ఇసోజిపేట గ్రామంలో కొనసాగుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను శనివారం సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నివాసమున్నవారితో పాటు వలస వెళ్లిన కుటుంబాలకు సమాచారం అందించి వారి పేర్లనూ సర్వేలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసే సమయంలో తప్పులు దొర్లకుండా చూడాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, తహసీల్దారు కృష్ణ, ఎంపీడీవో ఆనందమేరీ, ఎంపీవో శ్రీకాంత్‌గౌడ్ ఉన్నారు.

## ప్రతీ గింజను కొనుగోలు చేయాలి

- సన్న, దొడ్డు రకాల వడ్ల సేకరణకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- సంగారెడ్డి కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 5 : రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సన్న, దొడ్డు రకాల ధాన్యానికి విడివిడిగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సూపర్ ఫైన్ రకానికి క్వింటాలుకు రూ.2320, సాధారణ రకానికి రూ.2300 ధరను నిర్ణయించామన్నారు. సన్న రకానికి అదనంగా రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచి రైతులు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పించాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం మిల్లుకు చేరేవరకు అధికారులు పూర్తిగా బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిఘా ఏర్పాట్లు చేసి ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలులో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, శిక్షణ కలెక్టర్ మనోజ్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శివప్రసాద్, పౌరసరఫరాల డీఎం కొండల్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### గడ్డం వెంకటస్వామికి ఘన నివాళి..

సంగారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన గడ్డం వెంకటస్వామి జయంతి కార్యక్రమానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరై ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో వెంకటస్వామి ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారన్నారు. దళితుల హక్కుల సాధనకు నిరంతరం పోరాడిన గొప్ప నేత అని కొనియాడారు.

# 20 గిన్నిస్ ప్రపంచ రికార్డులు శివాలి జోహ్రి శ్రీవాస్తవ సొంతం

పటాన్‌చెరు రూరల్, అక్టోబరు 5: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ బీటెక్ పూర్వ విద్యార్థిని (2016-20) శివాలి జోహ్రి శ్రీవాస్తవ, ఆమె తల్లి కవిత జోహ్రి శ్రీవాస్తవ, తండ్రి అనిల్ శ్రీవాస్తవలు మూడు (18, 19, 20వ) గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించి చరిత్ర సృష్టించారు. 3,400 ఒరిగామి నెమళ్లు, 4,400 ఒరిగామి చొక్కాలు, 3,200 ఒరిగామి పందుల బొమ్మలను ఒకే చోట ఉంచిన ఈ కుటుంబం అతి పెద్ద ప్రదర్శనగా రికార్డు నెలకొల్పినట్టు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇంతకు మునుపు, శివాలి కుటుంబం చేతితో తయారుచేసిన కాగితపు బొమ్మలు, క్విల్డ్ పువ్వులు, ఒరిగామి వేల్స్ పెంగ్విన్‌లు, సిట్రస్ పండ్లు, మాపుల్ ఆకులు, కుక్కలు, రాక్షస బల్లులు.. మరికొన్నింటితో సహా వివిధ ప్రదర్శనలతో 17 గిన్నిస్ ప్రపంచ రికార్డులను పొందింది. ఇవేకాక 15 అసిస్ట్ వరల్డ్ రికార్డ్, పది యూనిక్ వరల్డ్ రికార్డులను శివాలి కుటుంబం కలిగి ఉందని వివరించారు. మొత్తం 20 గిన్నిస్ రికార్డులను సాధించిన శివాలి, ఆమె తల్లిదండ్రులను గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్.శాస్త్రి, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.సీతారామయ్య, గణిత విభాగం అధ్యాపకుడు డాక్టర్ మల్లికార్జున్, వివిధ విభాగాధిపతులు అభినందించారు.


కుటుంబసభ్యులతో శివాలి జోహ్రి శ్రీవాస్తవ

# పోరాటయోధుడు పండగ సాయన్న: నీలం మధు

పటాన్‌చెరు రూరల్, అక్టోబరు 5: నిజాం రజాకార్లకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి పేదల కడుపునింపిన పోరాటయోధుడు పండగ సాయన్న అని నీలం మధు ముదిరాజ్ అన్నారు. చేవెళ్ల పట్టణంలో పండుగ సాయన్న విగ్రహ ప్రథమ వార్షికోత్సవంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. పేదలు ఆకలితో అలమటించకూడదని భూస్వాముల నుంచి ఆహార ధాన్యాలు దోచి పేదల కడుపు నింపిన మహనీయుడని కొనియాడారు. ముదిరాజ్ కులంలో పుట్టిన సాయన్న బందుక్ ఎత్తి రజాకార్ల అన్యాయాలను ఎదిరించి బహుజనులకు అండగా నిలిచాడని గుర్తుచేశారు. సాయన్న స్ఫూర్తిని భవిష్యత్‌తరాలు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లింగం, యాదయ్య శ్రీనివాస్, మహేందర్, శ్రీరాములు, యాదయ్య, శివరాజ్, గణేష్, వెంకటేశ్, రాము, మైసయ్య, జనార్ధన్, వెంకటయ్య చేవెళ్ల నియోజకవర్గ నుంచి వచ్చిన ముదిరాజ్ సోదరులు పాల్గొన్నారు.


సాయన్న విగ్రహానికి పూలమాలవేస్తున్న నీలం మధుముదిరాజ్



## మహిళ సజీవ దహనం ఆటవిక చర్య

● మంత్రాల పేర ప్రాణం బలిగొంటారా?

● కాట్రియాలను సందర్శించిన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర బృందం


బాధిత కుటుంబానికి భరోసా ఇస్తున్న రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు


రామాయంపేట, అక్టోబరు 5: మంత్రాల పేర మహిళ సజీవ దహనం ఘటనను రాష్ట్ర జనవిజ్ఞాన వేదిక తీవ్రంగా ఖండించింది. శనివారం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు చలిమెల రాజేశ్వర్ నేతృత్వంలో సభ్యుల బృందం పర్యటించింది. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ద్యాగల లక్ష్మి అనే మహిళ సజీవ దహనం ఆటవిక చర్యగా బృందం అభివర్ణించింది. సాంకేతికపరంగా దూసుకెళ్తున్న ఆధునిక కాలంలో మంత్రాలు ఉన్నాయనేది మూర్ఖత్వం అన్నారు. గ్రామంలో జరిగిన దారుణాన్ని జనం ప్రోత్సహించిందన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా మూఢనమ్మకాల నిరోధక చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని పక్కింటి వారు అనారోగ్యం బారినపడితే.. ఇందుకు ఒక మహిళను చిత్రహింసలు పెట్టి పెట్రోల్ చల్లి హత్య చేస్తారా..అని ఆందోళన వ్యక్తం చేశారు.

## మహిళ సజీవ దహనం ఘటనలో ఆరుగురికి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్ఐ బాలరాజు

రామాయంపేట, అక్టోబరు 5 : మంత్రాల నెపంతో మెదక్ జిల్లా కాట్రియాలలో గురువారం అర్ధరాత్రి ఓ మహిళను సజీవ దహనం చేసిన ఘటనలో పోలీసులు శనివారం రాత్రి ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్ఐ బాల్‌రాజులు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ద్యాగల లక్ష్మి(50)కి, పాలివాళ్లకు ఇంటి స్థల వివాదం ఉన్నది. దీంతోపాటు తమ పిల్లలకు మంత్రాలు చేస్తోందని నమ్ముతున్నారు. పదేళ్లుగా వారి మధ్య ఉన్న కక్షలకు ఇటీవల పోశవ్వ అనే పక్కింటి మహిళ పిచ్చిపిచ్చిగా ప్రవర్తించటంతో ఈ అనుమానం మరింత బలపడింది. దీంతో ఎలాగైనా ద్యాగల లక్ష్మిని చంపాలని నిర్ణయించుకున్న పాలివాళ్ల ఆమెను కట్టెలతో తలపై మోది పెట్రోల్ చల్లి నిప్పంటించారు. నిందితుల్లో ద్యాగల మురళి, రామస్వామి, శేఖర్, రాజలత, లక్ష్మి, పోచవ్వలు ఉన్నట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

## జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు వికాస్


వికాస్

మద్దూరు, అక్టోబరు 5: ఇటీవల హన్మకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో మద్దూరు గ్రామ క్రీడాకారుడు వికాస్ గౌడ్ ఉత్తమ ప్రతిభ కనపర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర మల్లేశం తెలిపారు. హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో 7 వరకు జరిగే పోటీల్లో తెలంగాణ జట్టు తరపున వికాస్ పాల్గొంటున్నట్లు తెలిపారు.


## గజ్వేల్‌లో ఆర్ఎస్ఎస్ విజయదశమి ర్యాలీ


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు

గజ్వేల్, అక్టోబరు 5: గజ్వేల్ పట్టణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విజయదశమి ర్యాలీని నిర్వహించారు. పట్టణంలోని ఐవోసీ గ్రౌండ్స్ నుంచి సంగాపూర్ రోడ్డు మీదుగా భారీ ర్యాలీని చేపట్టగా, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రాంతీయ ప్రచారక్ లింగం శ్రీధర్‌జీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆర్ఎస్ఎస్ ఉద్దేశాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ధారం గురువారెడ్డి, వెంకటరమణ, పట్టణాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, మండలాధ్యక్షుడు అశోక్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్లు సురేశ్, మహేశ్, ఆర్ఎస్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పెళ్లింట పెను విషాదం

● తెల్లారితే పెళ్లి అనగా వరుడి తండ్రి మృతి


ఖాసిం(ఫైల్)

రాయపోల్, అక్టోబరు 5: తెల్లారితే అబ్బాయి పెళ్లి. అంతా పెళ్లి పనుల్లో మునిగిపోయారు. అంతలోనే ఆ కుటుంబంలో విషాదకరమైన సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం మంతూర్ గ్రామానికి చెందిన మాజీ వీఆర్ఏ మహ్మద్ ఖాసిం(72) చిన్న కుమారుడు నిజాముద్దీన్ వివాహం నిశ్చయమైంది. శనివారం ఉదయం పెళ్లి జరగాల్సి ఉండగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. పెళ్లి కార్యక్రమంలో భాగంగా ఖాసిం, తన భార్య సాహెరా, మరో కుమారుడు వసీయొద్దీన్‌తో కలిసి శనివారం తెల్లవారుజామున కారులో వధువు ఇంటికి వెళ్లి లాంఛనాలు పూర్తి చేసుకుని తిరిగి వస్తున్న క్రమంలో కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఖాసిం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందగా, సాహెరా, వసీయొద్దీన్‌కు గాయాలయ్యాయి. మరికొన్ని గంటల్లో పెళ్లి జరగాల్సి ఉండగా ఆ ఇంట్లో ఈ విషాదం సంఘటన చోటుచేసుకోవడంతో కుటుంబసభ్యులతో పాటు గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత కుటుంబసభ్యులను ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు పర్వేజ్ పరామర్శించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పరామర్శించి సంతాపం ప్రకటించారు.

# వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

వేర్వేరు ఘటనలో నలుగురు మృతిచెందారు. కడుపునొప్పి భరించలేక ఒకరు, భార్య పుట్టింటికి వెళ్లిందని మరొకరు ఆత్మహత్య చేసుకోగా.. విద్యుదాఘాతంతో ఒకరు, రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు.

### కడుపునొప్పి భరించలేక..


మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, అక్టోబరు 5: కడుపునొప్పి భరించలేక విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ పరశురాములు వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన సుకూరి తరుణ్(19) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఇతను కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చాలా ఆస్పత్రులు తిరిగినా.. నొప్పి తగ్గకపోవడంతో రెండురోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. తరుణ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంటకయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తరుణ్ మృతికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

### భార్య పుట్టింటికి వెళ్లిందని..


ఎల్లేశ్(ఫైల్)

తూప్రాన్, అక్టోబరు 5: భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తూప్రాన్ మండలం వెంకటాయపల్లి గ్రామానికి చెందిన కిష్టారం ఎల్లేశ్(35)కు మెదక్‌కు చెందిన యాదమ్మతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. ఎల్లేశ్ తాగుడుకు బానిసకావడంతో విసుగు చెందిన యాదమ్మ ఏడాదిన్నర క్రితం పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. కాగా ఈనెల 3న భార్య వద్దకెళ్లిన ఎల్లేశ్ రావాలని కోరాడు. అందుకు ఆమె రానని చెప్పడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఎల్లేశ్ శుక్రవారం సాయంత్రం తూప్రాన్ సమీపంలో గడ్డి మందు తాగాడు. చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

### విద్యుదాఘాతంతో..


కోటే చంద్రప్ప మృతదేహం

న్యాల్‌కల్, అక్టోబరు 5: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. న్యాల్‌కల్ మండలం వడ్డి గ్రామానికి చెందిన కోటే చంద్రప్ప(55) శుక్రవారం రాత్రి గ్రామంలోని చిన్నాన్న మారుతప్ప ఇంటివద్ద గల పశువుల పాకలో ఆవును కట్టేసేందుకు వెళ్లాడు. పశువులపాక పక్కనే గల బసవేశ్వరుడి గుడివద్ద ఉన్న మురుగు కాలువలో నీరు ఆగి ఉండడంతో చెత్తను తొలగిస్తున్నాడు. పక్కనే ఉన్న సీరియల్ లైట్ల డెకరేషన్ పరదను పట్టుకోవడంతో షాక్‌కు గురై కాలువలో పడిపోయాడు. అక్కడే ఉన్న భార్య శాంతమ్మ గమనించి చంద్రప్పను లేపేందుకు ప్రయత్నించగా.. ఆమెకూ షాక్ తగలడంతో ఒక్కసారిగా పక్కకు తప్పుకున్నది. పక్కనే ఉన్న గ్రామస్థులు వచ్చి చంద్రప్పను చికిత్స నిమిత్తం బీదర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడి భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు హద్నూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### గుమ్మడిదలలో..

గుమ్మడిదల, అక్టోబరు 5: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గుమ్మడిదల మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుర్గయ్య అన్నారం గ్రామ సమీపంలోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం బైక్‌పై పనులకు వెళ్తుండగా.. వెనక నుంచి వేగంగా వచ్చిన జంగంపేటకు చెందిన డప్పు సాయికుమార్ దుర్గయ్య బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో దుర్గయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

● తులం బంగారం, రూ.40 వేలు అపహరణ


దుర్గయ్య(ఫైల్)

జగదేవ్‌పూర్, అక్టోబరు 5: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి రూ.40 వేల నగదు, తులం బంగారాన్ని అపహరించుకుపోయారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం మునిగడపకు చెందిన తలారి సాయిలు గురువారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి చేర్యాల మండలం మర్రిముస్త్యాలలో దశదినకర్మకు బంధువుల ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం తిరిగొచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూశారు. బీరువాలోని తులం బంగారంతో పాటు రూ.40 వేల నగదును ఎత్తుకెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నెలరోజుల వ్యవధిలోనే రెండు దొంగతనాలు జరగడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో రాత్రి వేళల్లో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని, పనిచేయని సీసీ కెమెరాలను బాగు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థినులు


ఎంపికైన విద్యార్థినులు

కోహెడ, అక్టోబరు 5: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సిద్దిపేట జిల్లా కోహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు సీహెచ్.శ్రీవి, ఫైజున్నీస ఎంపికైనట్లు హెచ్ఎం మహ్మద్ మహమూద్ తెలిపారు. ఈనెల 7, 8 తేదీల్లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నారు. ఇటీవల సిద్దిపేటలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రథమస్థాయిలో నిలిచారన్నారు. రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికయ్యేలా కృషిచేసిన ఫిజికల్ డైరెక్టర్ డి.పుష్పలతను అభినందించారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులు


అవార్డులతో ఆర్టీసీ ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 5: సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో ఉత్తమ సేవలందించిన ఆర్టీసీ ఉద్యోగులను ప్రగతి చక్ర అవార్డులకు ఎంపిక చేశారు. సంగారెడ్డిలోని స్థానిక డిపోలో శనివారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా డిపోకు చెందిన 18 మంది ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులను డిపో మేనేజర్ ఉపేందర్ అందజేసి మాట్లాడారు. ప్రతినెలా ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసి ప్రశంసాపత్రాలు అందజేసి ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సువర్ణ, రాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## 'ఎల్‌ఆర్‌ఎస్' పరిష్కారాన్ని వేగం చేయాలి



మంగల్‌పేటలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే తీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

నారాయణఖేడ్, అక్టోబరు 5: ఎల్‌ఆర్‌ఎస్ ఫైళ్ల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. శనివారం ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద ఖేడ్ మండలం అంత్వార్, ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డుకు సంబంధించిన మంగల్‌పేటలో సర్వే తీరును పరిశీలించారు. తప్పులు లేకుండా చేయాలని సిబ్బందికి సూచించారు. కుటుంబ వివరాలు, ఫొటోలు తదితర విషయాల్లో తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం విషయంలో ఖేడ్ ప్రాంతం వెనుకబడి ఉన్నందున ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అధికారుల సందేహాలను నివృత్తి చేసి అవసరమైన సూచనలు, సలహాలనిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో అశోక చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## 8 లోగా సర్వే వివరాలు నమోదు చేసుకోవాలి

నర్సాపూర్, అక్టోబరు 5: ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియ నర్సాపూర్ నియోజకవర్గంలోని గొల్లపల్లి, పట్టణంలోని 8వ వార్డులో దాదాపు పూర్తయ్యే దశకు వచ్చిందని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో సర్వే సంబంధించిన సమీక్ష సంబంధిత అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సర్వే ఈ నెల 8వ తేదీ వరకు సర్వే జరుగుతుందని చెప్పారు. సర్వే సందర్భంగా అధికారులు వచ్చిన సమయంలో లేని వారు తమ వివరాలను గొల్లపల్లిలో పంచాయతీ కార్యాలయంలో, నర్సాపూర్‌లో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌లు కె.శ్రీనివాస్, ఆంజనేయులు, ఎంపీడీవో మాధవిలత పాల్గొన్నారు.

## బొల్లారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

జిన్నారం, అక్టోబరు 5: బొల్లారంలో రూ.50లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి శనివారం శంకుస్థాపన చేశారు. బీసీ కాలనీలో సీసీ రోడ్డు పనులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు కౌన్సిలర్లు గోపాలమ్మ, చంద్రయ్యలతో కలిసి చైర్‌పర్సన్ శంకుస్థాపన చేశారు. వెంట ఏఈ కిష్టయ్య ఉన్నారు.



సంగారెడ్డిలోని శ్రీ అక్షయ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



జహీరాబాద్: జాగృతి కళాశాలలో విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న గోదావరిఅంజిరెడ్డి



పాపన్నపేట కళాశాలలో సంబురాలు

# అలరిస్తున్న బతుకమ్మ వేడుకలు



చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



నర్సాపూర్: ఎల్లంకి కళాశాలలో సంబురాలు

**తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలతో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో సందడి వాతావరణం నెలకొన్నది. సాయంత్రం వేళ మహిళలు, యువతులు తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలను కూడళ్లలో ఒక్కచోట చేర్చి బొడ్డెమ్మ పాటలతో హోరెత్తిస్తున్నారు. కళాశాలలకు పండుగ సెలవులు ఆదివారం నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా ఒక రోజు ముందు పలు కళాశాలల్లో విద్యార్థినులు వేడుకలు జరుపుకోవడంతో శనివారం పండుగ వాతావరణం నెలకొన్నది. అనంతరం సమీపంలోని చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.**

సంగారెడ్డి అర్బన్/కొండాపూర్/జహీరాబాద్, అక్టోబరు 5: కొండాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్ శ్రీఅక్షయ కళాశాలలో శనివారం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులు డీజే పాటలతో ఆడి పాడి సందడి, చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీశైలం, కరస్పాండెంట్ వీరప్ప, డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని జాగృతి డిగ్రీకళాశాలలో నిర్వహించిన బతుకమ్మసంబురాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి విద్యార్థినులతో కలిసి ఆడిపాడి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను రేపటితరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో జాగృతికళాశాల నిర్వాహకులు సుభాష్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని జూనియర్ కళాశాలలో బతుకమ్మవేడుకలను ఘనంగా నిర్వహించారు.

### మెదక్ జిల్లాలో..

నర్సాపూర్/చిన్నశంకరంపేట/పాపన్నపేట/వెల్దుర్తి, అక్టోబరు 5: నర్సాపూర్‌లోని ఎల్లంకి డిగ్రీ కాలేజీలో శనివారం విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి వలయాకారంగా తిరుగుతూ బతుకమ్మ ఆట పాటలతో సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్‌తో పాటు జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజ్ ఇతర ఫ్యాకల్టీలు పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులు బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. పాపన్నపేట జూనియర్ కళాశాల విద్యార్థినులు శనివారం పాపన్నపేటలో బతుకమ్మ వేడుకలు సంబరంగా జరుపుకున్నారు. వెల్దుర్తి మండల కేంద్రంలోని శ్రీరాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలకు డీఐఈవో మాధవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

### బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

నారాయణఖేడ్, అక్టోబరు 5: నారాయణఖేడ్ పట్టణంలోని 7వ వార్డులో బతుకమ్మ ఉత్సవాల కోసం బతుకమ్మ కుంట వద్ద శనివారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్‌లు ఏర్పాట్లను పరిశీలించారు. ఏటా బతుకమ్మ కుంట వద్ద ఉత్సవాలను నిర్వహించనున్నందున, ఉత్సవాల రోజున మహిళలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వెంట మాజీ సర్పంచు అప్పారావు షెట్కార్, మున్సిపల్ కౌన్సిలర్లు మాజీద్, వివేకానంద్, రాజేష్, సంధ్యారాణిరామక్రిష్ణ, సవిత హన్మండ్లు, సద్దాం తదితరులు ఉన్నారు.

## గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

మనోహరాబాద్, అక్టోబర్ 5: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. శనివారం ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని కాళ్లకల్ గ్రామశివారులో భిక్షాటన చేసే వ్యక్తి బుధవారం స్థానిక క్లాసిక్ దాబా వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో చుట్టుపక్కల వారు గమనించి రాత్రి 10 గంటలకు కాళ్లకల్ జీపీ కారోబార్ ప్రత్యూషకు సమాచారమందించారు. ఆమె ఘటనాస్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడి నుండి గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి సుమారు 46 సంవత్సరాల వయస్సు, ఎత్తు 5.5 అడుగులు ఉంటాడని తెలిపారు. కారోబార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

## బస్సులోంచి జారిపడి యువడికి త్రీవగాయాలు

పుల్‌కల్, అక్టోబరు 5: ఆర్టీసీ బస్సులో నుంచి కింద జారి పడి ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారులో సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ నంబరు జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన రేబో(21) మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో గల డీఎస్ దాబా హోటల్‌లో పని చేస్తున్నాడు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి వెళ్లి మెదక్ ఆర్టీసీ డిపో బస్సులో తిరుగుప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సులో ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తూ శివంపేట గ్రామ శివారులోని శ్రీ వీరభద్ర రైస్‌మిల్ వద్దకు రాగానే బస్సులో నుంచి కింద జారి పడగా, కుడికాలు విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం రేబోను సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

## కర్ణాటక రోడ్డు ప్రమాదంలో ఖేడ్ కూలీలకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన కూలీలు

నారాయణఖేడ్, అక్టోబరు 5: కర్ణాటక సరిహద్దుల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో, ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఖేడ్ మండలం పీర్లతండాకు చెందిన వలస కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో 18 మంది కూలీలు గాయపడగా, 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురు పరిస్థితి విషమంగా ఉంది. పీర్ల తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణఖేడ్ మండలం పీర్ల తండాకు చెందిన కూలీలు కర్ణాటక ప్రాంతంలో చిక్లి గ్రామంలో, సోయా పంటను కోతకు ఆటోల్లో వెళ్లి కూలీ పని ముగించుకొని, శుక్రవారం రాత్రి తిరిగి వస్తుండగా, కర్ణాటక సరిహద్దులోనే వీరి ఆటోకు ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ ప్రకాష్, నందినిలకు తీవ్ర గాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని హైదరాబాద్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన శారదాబాయి, సోనిబాయి, పారిబాయి, చందర్, రాందాస్, లక్ష్మణ్‌లను కర్ణాటకలోని బీదర్ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్పించారు. మిగతా పది మందికి స్వల్పంగా గాయాలయ్యాయి. గాయాలకు గురైన వారికి పీర్లతండా మాజీ సర్పంచు రాజేష్‌నాయక్, బీదర్ వైద్యశాలకు వెళ్లి మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు శనివారం తెలిపారు.

## వైన్స్‌లో రూ.40వేల విలువైన మద్యం చోరీ

నర్సాపూర్, అక్టోబరు 5: నర్సాపూర్ పట్టణంలో ప్రధాన రోడ్డుపై ఉన్న ఓ మద్యం దుకాణంలో చోరీ జరిగింది. నర్సాపూర్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న బృందావన్ వైన్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సిట్టింగు రూము నుంచి వైన్స్ వెనుక భాగం గోడను కూల్చారు. అందులో నుంచి దూరి సుమారు రూ.40వేల విలువగల మద్యంతో పాటు కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.5వేల నగదు ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకులు తెలిపారు. సీసీ కెమెరాల హార్డ్ డిస్కును కూడా ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు కూడా చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## మహ్మద్‌ప్రవక్తను అవమానించిన వారిపై ఫిర్యాదు

జహీరాబాద్/కోహీర్, అక్టోబరు 5: మహ్మద్ ప్రవక్తను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంఐఎం జహీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు మహ్మద్ అత్తర్‌అహ్మద్ ఆధ్వర్యంలో శనివారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డికి పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్తను అవమానపరిచే విధంగా మాట్లాడిన యతి నర్సింహానందసరస్వతిపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఐఎంనాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మహ్మద్ ప్రవక్త పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన యతి నర్సింహానంద్ సరస్వతిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ కోహీర్ మండలకేంద్రంలో పలువురు ముస్లింలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## ఆయిల్‌పామ్ సాగు ఎంతో మేలు

రామాయంపేట, అక్టోబరు 5: ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ కలిగిన ఆయిల్‌పామ్ సాగును ఎంచుకోవాలని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ప్రతాప్ సింగ్ రైతులకు సూచించారు. ఈ పంట ఎంతో ఆదాయ వనరులు తెచ్చి పెట్టనుందన్నారు. శనివారం ఇక్కడి రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పెంపకంలో రైతు సందేహాలను నివృత్తి చేశారు. సదస్సులో ఏవో రాజు నారాయణ, సోమలింగారెడ్డి, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రిమిసంహారక మందు వేస్తే పంట పాడైంది

చిన్నశంకరంపేట, అక్టోబరు 5: మండలంలోని సూరారం గ్రామంలో ఓ రైతు వరి పంటకు తెగులు సోకడంతో క్రిమిసంహారక మందును పిచికారి చేయంతో పంట పాడైందని దుకాణ డీలర్‌కు సమాచారం ఇస్తే సమాదానం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఏవో ప్రవీణ్‌కు ఫిర్యాదు చేస్తే గ్రామాన్ని సందర్శించి వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో పంటను పరిశీలించి పంట డ్యామేజ్ కవరేజ్ అయ్యేందుకు తగిన మందులు పిచికారి చేయాలని రైతు ముత్యాలుకు సూచించారు.

## విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలి: ఎమ్మెల్యే చింతా



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 5 : విద్యార్థులను దేశం గర్వించేలా ఉపాధ్యాయులను తీర్చిదిద్దాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ పేర్కొన్నారు. సంగారెడ్డి చౌరస్తాలోని పీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సంద్భంగా నియోజవర్గస్థాయిలో 150 మంది ఉత్తమ ఉపాధ్యాయ, అధ్యాపక పురస్కారాలను అందజేసే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఎంఈవోలు పాల్గొన్నారు.

### టెలికాం బోర్డు అడ్వైజర్ కమిటీ మెంబర్‌గా ఆకుల రమేష్

నిజాంపేట, అక్టోబరు 5: టెలికాం బోర్డు అడ్వైజర్ కమిటీ మెంబర్‌గా నిజాంపేట మండలం నందిగామ గ్రామానికి చెందిన ఆకుల రమేష్‌ను నియమించారు. ఈ మేరకు బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌కు, తనకు సహకరించిన మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రమేష్‌ను బీజేపీ నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సిద్దరాములు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా బంద్

పాపన్నపేట, అక్టోబరు 5: కొత్త స్తంభాల ఏర్పాటు కోసం పాపన్నపేటలోని నెహ్రూ విగ్రహం వద్ద ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జూనియర్ లైన్‌మన్ అస్లాం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు ఉండదని పేర్కొన్నారు.

### 'తల్లిపాలే శ్రేష్ఠం'

చిన్నశంకరంపేట, అక్టోబరు 5: చిన్నారులకు తల్లిపాలూ శ్రేష్ఠమైన ఆహారమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ పేర్కొన్నారు. శనివారం చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పలు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల్లోని శనివారం అన్నప్రసన్న కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు.

### పోలీస్ స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

హవేళిఘణపూర్, అక్టోబరు 5: హవేళిఘణపూర్ మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని మెదక్ ఏఆర్ డీఎస్పీ రంగనాయక్ శనివారం పరిశీలించారు. గ్రామ శివారులోని 407 సర్వే నంబరులో 2 ఎకరాల స్థలాన్ని జిల్లా ఉన్నతాధికారుల సూచనతో పరిశీలించినట్లు తెలిపారు.

### చెరువులు, కుంటలను పరిశీలించిన అధికారులు

హత్నూర, అక్టోబరు 5: హత్నూర మండల పరిధిలోని ముచర్ల, బోర్పట్ల గ్రామ శివారులో గల పలు చెరువు, కుంటలను నీటి పారుదల, రెవెన్యూ శాఖ అధికారులు శనివారం నాడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ గ్రామ శివారులోని ఆక్రమనకు గురైనట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. నీటిపారుదల శాఖ డీఈఈ రవికుమార్, ఏఈ భూపుత్ర, హత్నూర తహసీల్దార్ షేక్ పర్వీన్ ముచర్ల, బోర్పట్ల శివారులోని నాగటి చెరువు, కంసానికుంట, న్యారటివాణి కుంట, వన్నప్ప కుంటలను పరిశీలించారు. బోర్పట్ల-పల్పనూర్ ఎత్తిపోతల పథకం పైపులైన్‌ను పరిశీలించారు.

### ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు ప్రత్యేక కౌంటర్

తూప్రాన్/మనోహరాబాద్, అక్టోబరు 5: తూప్రాన్ ఆర్డీవో కార్యాలయం, మనోహరాబాద్ తహసీల్దార్ కార్యాలయాల్లో ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో జయచంద్రారెడ్డి, మనోహరాబాద్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు త్వరలో జరిగే ఎన్నికల కోసం ఓటరు నమోదు ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభించినట్లు వివరించారు.

# ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు



జిన్నారం: వావిలాలలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

జహీరాబాద్/జిన్నారం, అక్టోబరు 5: జహీరాబాద్ పట్టణంలోని పలుప్రాంతాల్లో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన సభ్యత్వనమోదు కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగ ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ బతుకమ్మ ఉత్సవాలను రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యం చేసేవిధంగ వ్యవహరిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగ ఆశించిన దానికంటే ఎక్కువ మొత్తంలో బీజేపీ సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జిన్నారం మండలంలోని వావిలాలలో శనివారం నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదులో పార్టీ జిల్లా ఇన్‌చార్జి బసవ లక్ష్మయ్య, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, అశోక్‌కుమార్, మద్దూరి రాజు, మండల శాఖ అధ్యక్షుడు జగన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

- నర్సాపూర్, అక్టోబరు 5: మెదక్ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో బీజేపీ సభ్యత్వానికి మంచి ఆదరణ వస్తుందని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ మురళీధర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ బీజేపీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించిన సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలలో కలిపి మొత్తం లక్ష మందిని పార్టీ సభ్యత్వం స్వీకరించాలని లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోడరాజేందర్, అసెంబ్లీ కన్వీనర్ రమణరావు పాల్గొన్నారు.

## సంగారెడ్డి ఐటీఐలో ఆరు కొత్త ట్రేడ్లు

- నేటి నుంచి వాక్ ఇన్ అడ్మిషన్స్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 5 : సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐలో కొత్తగా ఆరు ట్రేడ్లు అందుబాటులోకి వచ్చినట్లు ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5 నుంచి 9 వ తేదీ వరకు ఆసక్తి కలిగిన విద్యార్థులు వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్(ఏడాది కోర్సు), ఇండస్ట్రియల్ రోబోటిక్ డిజిటల్ మ్యానిఫ్యాక్చరింగ్(ఏడాది కోర్సు), ఆర్టిసన్ యూసింగ్ అడ్వాన్స్ టూల్స్(ఏడాది కోర్సు), బేసిక్ డిజైనర్ వర్చువల్ వెరిఫయర్(రెండేళ్ల కోర్సు), అడ్వాన్స్ సీఎన్‌సీ టెక్నీషియన్(రెండేళ్ల కోర్సు), మెకానిక్ ఎలక్ట్రిక్ వేహికిల్(రెండేళ్ల కోర్సు) ట్రేడ్లు కొత్తగా అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఇంతకు ముందు వివిధ ఫేస్‌లల్లో అప్లై చేసుకున్న వారు కొత్తగా అప్లై చేసుకునే అవసరం లేదని, కొత్తగా అప్లై చేసే వారు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అదే విధంగా ఐటీఐలో సీట్లు వచ్చిన వారు కొత్తగా అప్లై చేసుకోవడానికి అనర్హులని పేర్కొన్నారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ) ఏర్పాటులో భాగంగా ఈ ఆరు కోర్సులు విద్యార్థుల కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని విద్యార్థులు ఈ సదావకాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# వెల్దుర్తి ఎస్‌వీఆర్ గ్యాస్ డీలర్‌కు నోటీసులు


- ఈ నెల 18న సాక్ష్యాలతో హాజరై వివరణ ఇవ్వాలి

వెల్దుర్తి, అక్టోబరు 5: వెల్దుర్తికి చెందిన ఎస్‌వీఆర్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది నిండు సిలిండర్ నుంచి ఖాళీ సిలిండర్‌లోకి గ్యాస్‌ను రీఫిల్లింగ్ చేస్తూ పట్టుబడిన ఘటనపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు గ్యాస్ డీలర్ శ్రీనివాస్‌రెడ్డికి నోటీసులు అందజేశారు. గతనెల 24న మండల పరిధిలోని దామరంచలో గ్యాస్ రీఫిల్లింగ్ చేసిన ఘటనపై సివిల్ సప్లయ్ ఉప తహసీల్దార్ ప్రణీతరెడ్డి గ్రామంలో పర్యటించి విచారణ చేపట్టారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయడానికి వచ్చినవారు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, నిండు సిలిండర్ నుంచి ఖాళీ గ్యాస్ సిలిండర్‌లోకి గ్యాస్‌ను రీఫిల్లింగ్ చేయడంతో తీవ్రంగా నష్టపోతున్నామని వినియోగదారులు లిఖిత పూర్వకంగా ప్రణీతరెడ్డికి ఫిర్యాదు చేశారు. విచారణలో వినియోగదారుల ఆరోపణలు నిజమని తేలడంతో పాటు గ్యాస్ డెలివరీ చార్జీలు వినహాయించకుండా డబ్బులు వసూలు చేయడం, సొంత ఇంటిలో గ్యాస్ కార్యాలయాన్ని ఉంచి సిలిండర్లు పంపిణీ చేయడం గుర్తించి, నివేదికను జిల్లా ఉన్నతాకారులకు అందజేశారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు ఎస్‌వీఆర్ గ్యాస్ డీలర్‌షిప్‌ను ఎందుకు రద్దు చేయవద్దో 18 మధ్యాహ్నం 3 గంటలకు సాక్ష్యాలతో హాజరై రాతపూర్వకంగా వివరణ సమర్పించాలని శ్రీనివాస్‌రెడ్డికి ఇచ్చిన నోటీస్‌లో అధికారులు పేర్కొన్నారు.

## గడ్డం వెంకటస్వామికి ఘన నివాళి

తూప్రాన్/చిన్నశంకరంపేట, అక్టోబరు 5: మండలంలో శనివారం గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద వెంకటస్వామి చిత్రపటం ఏర్పాటు చేసి ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులర్పించారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో శనివారం జి వెంకటస్వామి జయంతి వేడుకలను అధికారులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వెంకటస్వామి ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, ఎంపీవో గిరిజారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



సంగారెడ్డిలో గాయత్రీదేవి అలంకరణలో శ్రీవాసవీ మాత



సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో గాయత్రిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



వట్‌పల్లి: దుద్యాలలో ఆదిపరాశక్తి అమ్మవారు



నారాయణఖేడ్: మంగల్‌పేటలో అన్నపూర్ణదేవిగా దర్శనం



వెల్దుర్తి: మన్నెవారి జలాల్‌పూర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

**దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో ఆయా దేవీ మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి ప్రతిమలు వివిధ రూపాల్లో భక్తుల పూజలందుకుంటున్నాయి. శనివారం గాయత్రీ మాత, అన్నపూర్ణాదేవి అలంకారాల్లో అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.**

సంగారెడ్డి అర్బన్/సంగారెడ్డి రూరల్/వట్‌పల్లి/రాయికోడ్/మునిపల్లి/నారాయణఖేడ్, అక్టోబరు 5: సంగారెడ్డి శివారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మూడో రోజు శ్రీవాసవీ మాత గాయత్రీమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలోని సప్తప్రాకారయుత శ్రీ దుర్గాభవానీ మహాక్షేత్రంలో శనివారం మూడో రోజు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ వేడుకలకు సంగారెడ్డి చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా పటాన్‌చెరు, హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. వట్‌పల్లి మండలంలోని దుద్యాల్‌లో గల శ్రీ గిరి శేషాద్రినాథ్ హరి హరి మహాక్షేత్రంలోని ఆదిపరాశక్తి అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో పూజలందుకున్నారు. రాయికోడ్‌లోని ముమ్మాదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు సందీప్‌కుమార్ జోషి ఆధ్వర్యంలో అమ్మవారి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునిపల్లి మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. కార్యక్రమంలో పూజారి అయ్యప్పస్వామి, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు. నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలోని దుర్గాభవానీ మాత ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవి అవతారంలో శాకంబరీగా అలంకరించారు. ఉదయం, సాయంత్రం భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, సాయంత్రం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

### మెదక్ జిల్లాలో..

తూప్రాన్/వెల్దురి/హవేళిఘణపూర్/చిన్నశంకరంపేట/టేక్మాల్/ రేగోడు/రామాయంపేట, అక్టోబరు 5: తూప్రాన్ పట్టణంలో శ్రీదుర్గాదేవి, శ్రీనవదుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం దుర్గామాత అన్నపూర్ణదేవి ఆలంకరణలో దర్శనమిచ్చారు. శ్రీదుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో చండీహోమం, కుంకుమార్చన నిర్వహించారు. మహంకాళి ఆలయంలో శ్రీనవదుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో చండీహోమం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. వెల్దుర్తి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదుర్గా భవాని సేవ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారు శనివారం భక్తులకు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. హవేళిఘణపూర్‌లో దుర్గామాత అన్నపూర్ణదేవిగా దుర్గ భక్తులకు దర్శనమిచ్చింది. చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు కొర్విపల్లి, శాలిపేట, చందంపేట, జంగరాయి తదితర గ్రామాల్లోని దుర్గామాత ప్రతిమలను భక్తులు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. టేక్మాల్ మండలంలోని పల్వంచ, బోడ్మాట్‌పల్లి గ్రామాల్లో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. రేగోడు, గజవాడలో దుర్గామాత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. రామాయంపేటలో దుర్గామాత అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఇక్కడి మహంకాళి ఆలయంతో పాటు పలు వీధుల్లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించారు. హిందూ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన మండపం వద్ద అన్నప్రసాద వితరణ చేపట్టారు.



హవేళిఘణపూర్‌లో అన్నపూర్ణమాతగా..



చిన్నశంకరంపేట: కొర్విపల్లిలో అన్నపూర్ణ దేవిగా దుర్గామాత